**కథ**

# అమ్మ పెట్టిన చివరి ముద్దు

**దేవీ సత్య**

**జనయిత్రీ హాస్పిటల్. ఇంటెన్సివ్ కేర్ యూనిట్.**

**రాత్రి 11 గంటలు దాటుతోంది.**

**చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ, అతి కష్టం మీద ఆక్సిజన్ పీలుస్తూ బెడ్ మీద అచేతనంగా పడి ఉన్న అమ్మ.**

అమ్మ మంచం చుట్టూ చేరి ఏ నిముషానికేమవుతుందో, ఏ క్షణానికేమవుతుందో..మనసులో దేవుణ్ణి తలుచుకుంటూ భయాందోళనలతో బిక్కమొహాలేసుకొని ఊపిరి బిగపెట్టి అమ్మనే చూస్తూ..మౌనంగా రోదిస్తూ..మేము.

''భయపడకమ్మా! అమ్మ తప్పకుండా బ్రతుకుతుంది. అమ్మకేం కాదు'' అని ఓసారి,

''చెప్పలేమురా నాన్నా! నా కాళ్ళూ చేతులూ వణుకుతున్నాయి'' అని ఓసారి నాన్నగారు దీనంగా అంటుంటే, స్క్రీన్‌పై పల్స్‌రేటు తగ్గుతూ పెరుగుతూ, పెరుగుతూ తగ్గుతుంటే గుండె వేగంగా కొట్టుకోసాగింది మా ఇద్దరికీ.

మరో గంట గడిచింది. భరించలేనంత నిశ్శబ్దంగా ఉంది హాస్పిటల్.

అమ్మను చూడలేక కాదు..కాదు..అమ్మ ప్రాణం పోవడాన్ని చూడలేక నాన్నగారిని గట్టిగా పట్టుకొని ఏడ్చాను. ఆ క్షణం రాకూడదు. రాకూడదు. రాకముందే ఎక్కడికైనా పారిపోవాలి. వెంటనే బాత్‌రూమ్‌లోకి పరుగెత్తి గుండె పగిలేలా ఏడ్చాను. అమ్మ లేని మా ఇల్లు ఊహించుకోవడానికే భయంగా ఉంది.

'దేవుడా! అమ్మను బ్రతికించు. అమ్మను మాకు దక్కించు. ఆస్తి కావాలని, ఐశ్వర్యం కావాలని మేమడగటం లేదు. అమ్మ కావాలని అడుగుతున్నాం. అమ్మని ఇంకొంతకాలం బ్రతకనివ్వు. మా కోసం ఎన్నో కష్టాలు పడింది. ఇప్పుడు మేము ప్రయోజకులమయ్యాం. కొద్ది కాలమైనా తనని సుఖపెట్టనివ్వు. కరుణించు స్వామీ! కరుణించు. అమ్మను చూడు ఒక్కసారి. నీకు ఎన్నో పూజలు చేసింది, ఉపవాసాలు చేసింది. మడి, ఆచారం అంటూ నిత్యం నీ నామస్మరణే చేసింది. నోములు, వ్రతాలు చేసింది. అమ్మను తీసుకెళ్ళిపోకు'

ప్రతీక్షణం భారంగా, భయంకరంగా అనిపిస్తోంది. నర్సులు, వార్డు బోయ్‌లు ఇవేమీ పట్టనట్టు నవ్వుతూ మాట్లాడుకుంటూ ఎవరి డ్యూటీ వాళ్ళు చేసుకుంటున్నారు. ఈ చావులు, రోదనలు, ఏడుపులు వాళ్ళకి మామూలే కదా!

సరిగ్గా వారం రోజుల క్రితం అమ్మకు ఏం అనుమానమొచ్చిందో, ఏమర్థమయ్యిందో నన్ను తమ్ముణ్ణి దగ్గరకు తీసుకొని ముద్దుపెట్టుకొని, నాన్నగారి చేతులని పట్టుకొని ఏదో చెప్పాలని ప్రయత్నించి విఫలమయ్యి; జాలిగా, దీనంగా, బాధగా మా వైపు చూస్తూ అలా అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయిన అమ్మ ఇప్పుడు ఐసియులో ఆ చూపులు కూడా మాకు లేకుండా..ఇంకా ఇంజక్షన్లు, టెస్టులు అంటూ సూదులతో గుచ్చుతుంటే అరిచే శక్తి కూడా లేకుండా, అమ్మని అలా చూస్తుంటే భరించలేనంత దుఃఖం కలుగుతోంది.

ఈ వారం రోజులూ అమ్మపడ్డ యాతన అంతా ఇంతా కాదు.

'కేన్సర్' ఎంత భయంకరమైన వ్యాధి. పేరు వింటేనే వళ్ళు జలదరిస్తుంది. 'నిత్యం భక్తి శ్రద్ధలతో భగవంతుని సేవలో లీనమై పోయే అమ్మ..ఎంత భక్తి ఉన్నా మమ్మల్ని నిర్లక్ష్యం చేయకుండా ఉగ్గుపాలతోనే మాకు ఎన్నో నీతికథలు చెప్పి మంచి మార్గంలో నడిపించిన అమ్మ, అడిగిన వాళ్ళకి అడగని వాళ్ళకి ఉన్నంతలోనే లేదనకుండా పెట్టే అమ్మ, నాన్నగారు పది వేలు తెచ్చినా, పది రూపాయలు తెచ్చినా అదే చిరునవ్వు, అదే ఆత్మీయతా కురిపించిన గొప్ప వ్యక్తిత్వం ఉన్న అమ్మ' అటువంటి అమ్మకి కేన్సరా? భగవంతుడా, నీకు మనసెలా ఒప్పింది?

అమ్మను చూడగానే డాక్టర్లకు తెలిసిపోయినా ''ఫరవాలేదు. ట్రీట్‌మెంట్ చేశాక తగ్గిపోతుంది'' అని చెప్పడంతో కాస్త రిలీఫ్‌గా ఫీలయ్యాం. డాక్టర్ల మాటలు పూర్తిగా నమ్మాం.


కానీ రెండు నెలల నుండీ ఆహారం లేని అమ్మ శరీరం టెస్టులన్నిటికీ తట్టుకోలేకపోతుందని, ఇంకా బలహీనపడి ఆ బలహీనత వల్ల వ్యాధి తీవ్రత ఎక్కువై మరికాస్త తొందరగా మరణానికి చేరువవుతుందని, నెలరోజులు బ్రతకాల్సిన అమ్మ వారం రోజులే బ్రతుకుతుందని, డబ్బు కోసం డాక్టర్లు అసలు విషయం చెప్పరని..మాకు ఎలా తెలుస్తుంది?

బయాప్సీ చేశాక అమ్మ మెదడు దెబ్బతిన్నది. మమ్మల్ని మరి గుర్తుపట్టలేదు. ఏవో పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతూ, ఒంట్లో బాధకి తట్టుకోలేక మధ్య మధ్యలో అరుస్తూ, మంచం మీద అటూ ఇటూ దొర్లుతుంటే అస్తమానూ చెదిరిపోతున్న అమ్మ ఒంటిమీద చీరను సర్దడం, అమ్మకి ఇటువంటి దుర్భర స్థితిని ఏర్పరచినందుకు దేవుణ్ణి నిందించడం, ఏ డాక్టరు ఎదురైనా అమ్మను గురించి అడగడం, 'రిపోర్ట్సు వచ్చాక గానీ ఏమీ చెప్పలేమమ్మా!' అని అనేసి వాళ్ళు వెళ్ళిపోవడం...ఇది హాస్పిటల్లో మా దినచర్యలో ఒక ముఖ్య భాగం అయ్యింది.

మరోరోజు గడిచాక అమ్మ ఆకలేసినా గుర్తించలేని, ఒకటికి వచ్చినా, రెంటికి వచ్చినా చెప్పలేని స్థితికి వచ్చింది.

అమ్మ ఎప్పుడు నోరు తెరుస్తుందా..అని చూడడం, తెరిచిన వెంటనే పళ్ళరసం వేయడం, బుజ్జగించి బ్రతిమాలి బలవంతంగా తాగించడం, అమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న ఈ రెండు నెలల్లోనూ కనీసం ఒక్కసారైనా అమ్మపక్కన కూర్చొని, అమ్మ చేయి పట్టుకొని ఒంట్లో ఎలా ఉందమ్మా? అని అడిగిన పాపాన పోలేదు. ఎంత స్వార్థపరులమమ్మా మేము. పైగా ఫిబ్రవరి, మార్చ్ బడ్జెట్ నెలలు. హెవీగా పెరిగిన వర్క్. క్షణం కూడా తీరిక లేకుండా పోయింది. అప్పుడు కూడా మేము ఎక్కడ బెంగ పెట్టుకుని వర్క్ సరిగా చెయ్యలేకపోతామోనని 'నాకేం లేదురా, తగ్గిపోతుంది కాస్త నలత ఉందంతే' అనేది అమ్మ.

ఒకటికి రెంటికి వెళ్ళినప్పుడల్లా గమనించి అమ్మను జాగ్రత్తగా పక్కకు జరిపి చీరలు, బెడ్ షీట్లు మారుస్తూ ఉండేవాళ్ళం. ఒక్కోసారి మార్చడానికి వీలయ్యేది కాదు. సిస్టర్లు అస్తమానూ బెడ్‌షీట్లు ఇచ్చేవారు కాదు. అప్పుడు బాగా వాసన వచ్చేది. అయినా నాన్నగారు అమ్మ పక్కనే చేరబడి, అమ్మను జోకొడుతూ ఎంతో జాగ్రత్తగా చూసుకొనేవారు. రెండు నెలలనుండీ నాన్నగారు కూడా అమ్మను పసిపాపలా చూసుకున్నారు. తల్లి తన బిడ్డకు చేసే చాకిరీలన్నీ



చేశారు. పళ్ళు తోమారు, స్నానం చేయించారు. అన్నం తినిపించారు. వాంతి వస్తే పట్టారు..ఇంకా చాలా...మేమే ఏమీ చేయలేక పోయాం. భార్య రుణం నాన్న తీర్చుకున్నా తల్లి సేవకు మేం నోచుకోలేకపోయాం.

హాస్పిటల్లో మిగతా పేషెంట్లు, వాళ్ళ బంధువులు ఎవరు చూసినా 'ఈవిడ బ్రతకడం కష్టం' అనేవాళ్ళు. అయినా మేం ఎంతమాత్రం నమ్మలేదు. అప్పటికి కూడా అమ్మ బ్రతుకుతుందనే ఆశ.

మాకోసం రాత్రనక, పగలనక శ్రమపడిన అమ్మ, తాను తినకుండా మాకోసం దాచిపెట్టిన అమ్మ, చిన్నపాటి జ్వరమొచ్చినా అల్లాడిపోయి నిద్రమాని పక్కనే కూర్చొని సేవ చేసిన అమ్మ, మా చదువుల కోసం తెల్లారే లేచి, అన్నం వండి, క్యారేజీలు కట్టి ఆడపిల్లనైనప్పటికీ నాకు ఒక్క పనీ కూడా చెప్పకుండా నిరంతరం చాకిరీతో చిక్కిపోయిన అమ్మ ఇప్పుడు మాకు ఉద్యోగాలొచ్చాక మాతో సంతోషంగా గడపకుండా, మా ఆనందాన్ని పంచుకోకుండా, సుఖమన్నది లేకుండా అన్యాయంగా, అర్ధాంతరంగా మమ్మల్ని వదిలి వెళ్ళిపోయింది.

కూతురిగా అమ్మతో అనుబంధం తమ్ముడి కంటే నాకే ఎక్కువ. తన చిన్ననాటి స్నేహితులు, కబుర్లు, చదువుకునేటప్పటి ఆశలు, ఆలోచనలు, తన పుట్టింటి సంగతులు అన్నీ చెప్పేది అమ్మ. ఆశ్చర్యపోయేదాన్ని. ''అమ్మకి అంత మంచి ఆశయాలు, అభిప్రాయాలు ఉండేవా?''

ఎన్ని ఉన్నా, ఎంత చదివినా ఆడపిల్ల పెళ్ళయ్యి అత్తవారింటికి వెళ్ళాక అన్నీ మర్చిపోవాల్సిందే! పని, వంట, పిల్లలు, భర్త, ఇల్లు, సంసారం..ఇవే లోకం. అమ్మకాలంలో అయితే అది నిజమే.

ఒక్కసారి అమ్మ జీవిత పుటల్లోకి తొంగి చూస్తే, ''నాకు ఊహ తెలిసేసరికి అమ్మ మా ఊరిలో ఉన్నటువంటి ఆధ్యాత్మిక మహిళా సమాజం సభ్యురాలు. మంచి గాయకురాలు. ఊరిలో ఏ శుభకార్యాలు అయినా, పూజా కార్యక్రమాలు అయినా అమ్మ పాట తప్పకుండా ఉంటుంది. అమ్మ పాటంటే నాకు చాలా ఇష్టం. ప్రతీరోజూ ఏదో సమయంలో అమ్మ ఒడిలో తల పెట్టుకొని నిద్రపోతూ నాకు నచ్చిన పాటలన్నీ అమ్మ చేత పాడించుకొని వినేదాన్ని. ఆ అలవాటు మొన్న మొన్నటి దాకా ఉంది. ఎక్కడికి వెళ్ళినా నన్ను తనతో పాటు తీసుకెళ్ళేది అమ్మ.

నాకు పాటలు నేర్పాలని, నేను పాడితే వినాలని ఎంతో తాపత్రయపడేది అమ్మ. నాకు కూడా ఇష్టమే. కానీ ఏం చేయను? మేనమామ వరస చిత్రలేఖనం వచ్చింది కాని అమ్మగొంతు నాకు రాలేదు. అమ్మకున్న ఆ చిన్న ఆశను కూడా తీర్చలేకపోయాను.

మంచి భర్త, పిల్లలు, ఇల్లు, ఆస్తి, అందరిలో గౌరవాభిమానాలు...చక్కగా ఉండేటటువంటి అమ్మ జీవితం ఏ దశకు మారిందీ, ఎలా మారిందీ తలుచుకుంటే ఇప్పటికీ కూడా ఎంతో కసి, బాధ, ఆవేశం కలుగుతూ ఉంటుంది నాకు.

పదహారేళ్ళ వయసులో పెద్దమ్మకి నాన్నగారి పట్ల ఏర్పడ్డ ఆకర్షణ, వ్యామోహం-వదిన అయినప్పటికీ ఆ వ్యామోహాన్ని చంపుకోలేక అది పెరిగి పెద్దదై కోరికగా మారి అది తీరక పగ, ద్వేషంగా రూపుదిద్దుకొని మా కుటుంబాన్ని చిత్రహింసల పాలు చేసింది. పెద్దమ్మకి అంత ధైర్యాన్నిచ్చింది ''ఆమెకున్న డబ్బు! అహంకారమా?''

ధర్మానికి, న్యాయానికి కట్టుబడి నాన్నగారు మౌనంగా ఉండిపోవడమా?

నాన్న శ్రీరాముడిలా ఉన్నందుకేనా శూర్పణఖ చేతుల్లో చిత్రవధకి గురైంది అమ్మ!

స్త్రీగా పుట్టడమేనా అమ్మ చేసిన పాపం! మరి పెద్దమ్మ కూడా స్త్రీయే కదా!

నిందలు, నిష్ఠూరాలు, అవమానాలు, ఫలితంగా పన్నెండేళ్ళు గడపదాటి బయటకు రాలేదు అమ్మ.

డబ్బుకి దాసోహమైన లోకం 'నీతి నియమాలని ఎప్పుడో డస్ట్‌బిన్‌లోకి నెట్టేసిందని వాటిని నమ్ముకున్న వాళ్ళని కాలితో తొక్కుతుందని అమ్మకు తెలియదా?'

''పురుషుడై ఉండి కూడా శీలం కోసం పోరా

డితే పిచ్చివాణ్ణి చూసినట్టు చూస్తుందని నాన్నకు తెలియదా?''

తెలిసి కూడా అవమానాలను దిగమింగుకున్నారా? ఆస్తినంతా పోగొట్టుకున్నారా? ఆకలితో బ్రతికారా? అన్ని కష్టాలను సహించారా? అందరూ ఉండి అనాథలయ్యారా?

ఇన్నేళ్ళలో ఏ ఒక్కరోజూ, ఒక్క నిముషం ఒక్కక్షణం అయినా మా నాన్నగారికి అనిపించలేదా ''నేను మగాణ్ణని, నాకు శీలం దేనికని?''

అందుకేనా, ఆ గొప్పతనానికేనా అమ్మ తలవంచింది. అందుకేనా 'మూడు పూటలా తిండి పెట్టలేకపోయినా, తన ఒంటిమీద సరైన చీర కూడా లేకపోయినా నాన్నను. దేవుడిగా భావించింది. పూజించింది.'

ఆ విషయాలన్నీ కూడా తెలిసీ తెలియని వయసులో తెలుసుకున్న నేను పెద్దమ్మ మీద, డబ్బున్నవాళ్ళమీద, సమాజం మీద కసిని పెంచుకుని, అంతవరకు నేను నేర్చుకున్న ధర్మం, నీతి, దేవుడు, భక్తిపట్ల విరక్తి కలిగి చాలా నిరాశా, నిస్పృహలకు లోనవుతుంటే అనుక్షణం నా పక్కన కూర్చుని, నాకు ఎన్నో కథలు చెప్పి, ఊరడించి నా చేత ఏ పనీ చేయించకుండా ఆ విషయాలన్నిటినీ మరపించడానికి, వాటి ప్రభావం నామీద పడకుండా ఉండడానికి ఎంతగానో శ్రమించింది అమ్మ. ఏ పనిలో ఉన్నా ధ్యాస అంతా నామీదే ఉండేది, అమ్మకి. ఇరవయ్యేళ్ళు వచ్చిన తర్వాత కూడా అన్నం తినిపించేది, ఒడిలో పడుకోబెట్టుకునేది, ఇంట్లో పని చేయకుండా చిన్నపిల్లలతో ఆడుకున్నా, బొమ్మలేసుకుంటూ కూర్చున్నా ప్రోత్సహించేది. అలాంటి స్వచ్ఛమైన, నిర్మలమైన అమ్మ ప్రేమవల్లనే నేను మామూలు మనిషినయ్యాను. అందుకే బాగా చదవాలి. పైకి ఎదగాలి. ఏదో ఒకటి సాధించాలి. అమ్మకు పూర్వ వైభవం తీసుకురావాలి. గృహనిర్బంధంలో ఉండిపోయిన అమ్మకు లోకాన్ని చూపించాలి అనుకున్నాను. కానీ అమ్మ లోకాన్నే విడిచిపెట్టి వెళ్ళిపోతుందని అనుకోలేదు.

★ ★ ★

ఆఖరి రోజున వచ్చిన ఒక కేన్సర్ స్పెషలిస్ట్ అమ్మను చూసి ''ట్రీట్‌మెంట్ చేసినా ఫలితం ఉండదు. వ్యాధి చివరిదశ కొచ్చేసింది. ఇంక ఎన్ని రోజులు బ్రతుకుతారన్నది కూడా చెప్పలేం. కనుక ఇంటికి తీసుకెళ్ళిపోండి. బ్రతికినన్ని రోజులు జాగ్రత్తగా చూసుకోండి'' అన్నారు.

''ప్లీజ్ డాక్టర్! అలా అనకండి డాక్టర్. ఏదో ఒకటి చేయండి. ఎంత డబ్బు అయినా ఫరవాలేదు. పోనీ ఇక్కడ కుదరదు అంటే మరెక్కడైనా రిఫర్ చేయండి డాక్టర్. అమ్మ లేకుండా బ్రతకలేము డాక్టర్. అమ్మ మా ప్రాణం'' కళ్ళనీళ్ళతో ప్రాధేయపడ్డాము.

''మీ బాధ అర్థం చేసుకోగలనమ్మా! కానీ మా చేతిలో ఏమున్నది. మేము కూడా నిమిత్త మాత్రులమే. చేయగలిగినంత వరకు మా విధి మేం నిర్వర్తించాం. ఇక ఆ దేవుడి దయ. గాడ్ బ్లెస్ యూ!'' అని చెప్పి అతను వెళ్ళిపోయారు.

దుఃఖం పొంగుకొచ్చింది. బాధ, ఆవేదన, ఆవేశం, ఆక్రోశం అన్నీ ఒక్కసారిగా వచ్చాయి. అప్పటికీ కూడా ఇంకా బయాప్సీ రిపోర్ట్ రాలేదు.

''రిపోర్ట్ వచ్చాకే ట్రీట్‌మెంట్ మొదలుపెడతాం అని చెప్పి అమ్మను ఇంతవరకు పట్టించుకోకుండా వదిలేశారు. ట్రీట్‌మెంట్ చేశాక తగ్గిపోతుందన్నారు. టెస్టులన్నీ చేయించారు. తీరా రిపోర్ట్స్ రాకముందే ఇంక లాభం లేదని తెలుసుకుని అసలు విషయం చెప్పేసి డిశ్చార్జ్ చేసేశారు. వ్యాధి చివరి దశలో ఉందని తెలిసి కూడా ఎందుకు? ఎందుకు టెస్టులు, స్కానింగులు, ఇంజక్షన్లు అంటూ మా అమ్మని అంత హింస పెట్టారు. కనీసం మాకు చివరి మాటలు, చివరి చూపు కూడా దక్కకుండా చేశారు? ఎందుకింత మోసం చేశారు? అసలు మీరు మనుషులేనా? హాస్పిటల్లో నరకాన్ని అనుభవించిందిరా మా అమ్మ!'' అని గట్టిగా అరవాలనిపించింది. చేతికందిన సామాన్లన్నీ విసిరేయాలనిపించింది.

కానీ ఏమీ చేయలేక అమ్మవైపే చూస్తూ కూర్చున్నాను నిస్సహాయంగా.

కొండంత ఆశతో వచ్చాము. గుండెలనిండా బరువు నింపుకొని వెళ్తున్నాము.

రాకూడదనుకున్న ఆ భయంకరమైన సమయం రానేవచ్చింది. ఇంటికి తీసుకొచ్చిన నాలుగు గంటల్లోపే అమ్మ చనిపోయింది.

ఇల్లంతా శోక సముద్రంలో మునిగిపోయింది. అమ్మ లేని ఇల్లు అయిపోయింది.

ఇంటికి రాగానే సేదదీరడానికి అమ్మ ఒడి ఇక లేదు.

ఏ చిన్న సుస్తీ చేసినా ప్రేమగా తల నిమిరే అమ్మ చల్లని చేతులు ఇక లేవు.

సంతోషమో, బాధో, భయమో కలిగినప్పుడు అమ్మని కావలించుకొని సాంత్వన పొందే రోజులు మరి లేవు.

తల్లీ, నాన్నా అంటూ ఆప్యాయంగా పిలిచే అమ్మ పిలుపులు మరిలేవు.

అయినా అమ్మ కనిపిస్తూనే ఉంది. ప్రతీ రోజూ ప్రతీ క్షణం గుర్తిస్తూనే ఉంది. ప్రతీ పనిలోనూ అమ్మ అవసరం, అమ్మ లేని లోటు తెలుస్తూనే ఉంది. అమ్మ ప్రేమ, అమ్మ మనసు, అమ్మ విలువ ఎంత గొప్పవో ఇంకా బాగా అర్థమవుతోంది. అమ్మ ఊరడింపులు, అమ్మ మందలింపులు, అమ్మ కొట్టిన దెబ్బలు చాలా గొప్పగా అనిపిస్తున్నాయి. అమ్మకు చెందిన ప్రతి వస్తువు ఎంతో విలువైనదిగా కనిపిస్తోంది. అమ్మతో గడిపిన ప్రతీ నిముషం ఎంతో అపురూపంగా అనిపిస్తున్నాయి.

అన్నిటికన్నా 'అమ్మపెట్టిన చివరిముద్దు' ఇంకా అపురూపంగా కనిపిస్తోంది. అమ్మ మాకు చివరిసారిగా ఇచ్చిన గొప్పదైన, స్వచ్ఛమైన, నిర్మలమైన, ఎన్నటికీ మర్చిపోలేని, అమూల్యమైన కానుక అది.

ఆ ముద్దులోనే-

'ఎన్నో ఆశలు ఉన్నాయి
ఆశయాలు ఉన్నాయి
ఆశీస్సులు ఉన్నాయి
ఆజ్ఞలు ఉన్నాయి'

మేము 'ఉన్నతంగా ఎదగాలన్న 'ఆశ', మంచిగా, నీతిగా పదిమందికీ సాయం చేస్తూ బ్రతకాలన్న 'ఆశయం', కలకాలం చల్లగా ఉండాలన్న 'ఆశీర్వాదం', కలిసిమెలసి ఉంటూ నాన్నగారిని జాగ్రత్తగా చూసుకోండి అన్న 'ఆ ముద్దు ద్వారానే తెలియజేసింది అమ్మ.

''తప్పకుండా అమ్మా! నువ్వు పెట్టిన 'చివరిముద్దు' సాక్షిగా నువ్వు చెప్పినట్టు నడుచుకుంటాము. నీ 'ఆశ' నెరవేరుస్తాము. నీ 'ఆశయం' తీరుస్తాము. నీ 'ఆజ్ఞ'ను శిరసావహిస్తాము. నీ 'ఆశీస్సులు' అందుకుంటాము.''

